

రూ.2.02 కోట్లతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి పరారు

నిందితుడిది కపిలేశ్వరపురం మండలం మాచరమట్ల ...మెయిన్‌లో



గంటి పెదపూడిలో పడవపై రాకపోకలు సాగిస్తున్న లంక గ్రామస్తులు



మానేపల్లి శివారు శివాయిలంకలో

పెరుగుతూ... తగ్గుతూ...

దోబూచులాడుతున్న గోదారమ్మ.... నదీపాయల్లో నిలకడగా

పి.గన్నవరం, జూలై 26: గోదావరి పెరుగుతూ... తగ్గుతూ... నిలకడగా దోబూచులాడుతూ లంక గ్రామాల ప్రజలను వణికిస్తోంది. వరద ప్రభావంతో లంక గ్రామాల ప్రజలు గత వారం రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి ఎగువున పెరుగుతూ, తగ్గుతూ ఉండటంతో ధవళేశ్వరం వద్ద వరద ప్రవాహం ప్రస్తుతం నిలకడగానే ఉంది. దిగువున సముద్రంలోకి 12 లక్షల క్యూసెక్కులు దాటి వదులుతున్నారు. దీంతో వరద ఉధృతి తగ్గినప్పటికీ వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధ గౌతమి నదీపాయలు ఇంకా నిండుగానే ప్రవహిస్తున్నాయి. పి.గన్నవరం మండలంలోని పలు లంక గ్రామాల ప్రజలు ఇంకా పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. మానేపల్లి శివారు శివాయిలంక గ్రామస్తులు మాత్రం రహదారి మొత్తం జలదిగ్బంధంలో ఉండడంతో నాటుపడవలపై ప్రయాణం సాగిస్తున్నారు. గ్రామం నుంచి బాహ్య ప్రపంచానికి రావాలంటే సుమారు గంటసేపు పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరమైతే అంతే సంగతులు అని ఆందోళన చెందుతున్నారు. వాడ్రేవుపల్లి శివారు చినకందాలపాలెం గ్రామస్తులు కూడా నాటుపడవలపైనే ఏటిగట్టుకు చేరుకుంటున్నారు. మండలంలోని శివాయిలంకలో సుమారు 450 మంది వరద బాధితులకు భోజనాలు పెట్టినట్టు కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ తెలిపారు. మండల వ్యాప్తంగా ఎనిమిది పడవల్లో వివిధ లంక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం గ్రామాల వారీగా ప్రత్యేకంగా నియమించిన అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నా రని, వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయని ఆర్డీవో స్పష్టం చేశారు.



బెంగాలీ నాట్లు... జోరుగా... హుషారుగా...

పి.గన్నవరం, జూలై 26:
ఏకరూప దుస్తులు ధరించి వరినారు నాటుతూ బెంగాలీ కూలీలు అబ్బురపరిచారు. పోతవరంలో కనిపించిన ఈ దృశ్యాన్ని రైతులతో పాటు అటుగా వెళ్లే ప్రజలు ఆసక్తిగా తిలకించారు. శుభానికి ప్రతీక అయిన పసుపు రంగు టీషర్టులు ధరించి... రఘుపతిరాఘవ రాజారాం పతీతపావన జైసీతారాం, జైసీతారాం అంటు భక్తి గీతం పాడుతూ జోరుగా హుషారుగా వరినాట్లు నాటుతున్నారు. ఒక ఏజెంటు ద్వారా బెంగాల్ నుంచి వచ్చామని, రోజుకు సుమారు 7-8 ఎకరాల్లో నాట్లు నాటుతామని చెప్పారు.

ఈ నెల 7తో ముగిసిన
అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలం
సహకార సంఘాల్లో
పేరుకుపోయిన వస్త్ర నిల్వలు



త్రిశంకు స్వర్గంలో!

చేనేత సహకార సంఘాలు

అమలాపురం రూరల్, జూలై 26: చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సిన గురుతర బాధ్యత కూటమి ప్రభుత్వంపై పడింది. గత వైసీపీ పాలనలో చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా ఆ పార్టీ నాయకులతో పాలకవర్గాలను నియమించి పాలన సాగించింది. ఆ తర్వాత ఏడాది కాలంగా అధికారులను అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించింది. అప్పట్లో జగన్ ప్రభుత్వం నియమించిన అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీల పాలన ఈ నెల 7వ తేదీతో ముగిసింది. ప్రస్తుతం చేనేత సహకార సంఘాలకు పాలకవర్గాలు గానీ, అధికారుల కమిటీ గానీ లేక చేనేత కార్మికులు ఉపాధికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. గత 20 రోజులుగా చేనేత సహకార సంఘాల పరిస్థితి త్రిశంకు స్వర్గంగా మారింది. చేనేత సహకార సంఘాలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 12న ఐదేళ్ల కాలపరిమితికి ఎన్నికలు జరిగాయి. వారి పదవీ కాలం 2018 ఫిబ్రవరితో ముగిసింది. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో అదే పాలకవర్గాలు ఆరు నెలల కాపపరిమితితో పని చేశాయి. 2019 ఆగస్టు వరకు అవే పాలకవర్గాలు కొనసాగాయి. సుమారు ఏడేళ్లుగా చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. వైసీపీ ఏలుబడిలో చేనేత సహకార సంఘాల పరిస్థితి అస్తవ్యస్తంగా మారి సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. సహకార సంఘాలకు చెల్లించాల్సిన ఎన్నో రాయితీలకు జగన్ ప్రభుత్వం మంగళం పాడేసింది. దాంతో జిల్లాలోని 23 చేనేత సహకార సంఘాల్లో మూడు, నాలుగు సంఘాలు మినహా మిగిలిన అన్ని సంఘాలు పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయాయి.

చేనేత మాతృ సంస్థ ఆప్కో కూడా వైసీపీ నాయకుల పాలన, అధికారుల ఏలుబడిలోనే సాగింది. కొవిడ్ సమయంలోనే వైసీపీ నాయకులు ఆప్కోలో దోపిడీకి పాల్పడినట్టు ఇప్పటికే కూటమి ప్రభుత్వం గుర్తించి విచారణకు ఆదేశించింది. చేనేత సహకార సంఘాల నుంచి ఆప్కో సక్రమంగా వస్త్రాలు కొనుగోలు చేయకపోవడం, కొనుగోలు చేసిన సొమ్ములు సకాలంలో జమచేయని పరిస్థితి ఏర్పడింది. దాంతో చేనేత సహకార సంఘాల్లో కోట్లాది రూపాయల మేర వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. గతంలో చంద్రబాబు పాలనలో ఆప్కోతో పాటు చేనేత సహకార సంఘాలకు సైతం వస్త్ర విక్రయాలపై 20 నుంచి 30 శాతం రిబేటు సౌకర్యం కల్పించారు. దాంతో మిల్లు వస్త్రాల పోటీ ధాటికి చేనేత తట్టుకోగలిగేది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రిబేట్ సదుపాయాన్ని ఎత్తేసింది. దాంతో సంఘాల్లో తయారైన ఉత్పత్తులను అటు ఆప్కో కొనుగోలు చేయక, రాయితీలు కల్పించకపోవడంతో సంఘాల్లో వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. జిల్లాలోని అంగర చేనేత సహకార సంఘంలో రూ.1.10 కోట్ల మేర నిల్వలు పేరుకుపోయాయి. ఆదివారపుపేట శివబాలయోగి చేనేత సహకార సంఘంతో పాటు మోరి, కె.జగన్నాథపురం తదితర సహకార సంఘాల్లోనూ వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి.

రాయితీల బకాయిలు కోట్లలోనే..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేత కార్మికులు, సంఘాలకు నూలుపై 20 నుంచి 40 శాతం సబ్సిడీ అందించేవారు. 2021 మార్చి 3 వరకు జిల్లాలోని 16,760 మంది కార్మికులకు రూ.3.54 కోట్లు బకాయిపడ్డారు. చేనేత వస్త్రాల అమ్మకాలపై గత చంద్రబాబు పాలనలో 20 నుంచి 30 శాతం రిబేటు అందించేవారు. 2019-20 నాటికి రూ.2.81 కోట్ల మేర బకాయిలను వైసీపీ ప్రభుత్వం జిల్లాకు విడుదల చేయలేదు. ఇక త్రిఫ్ట్ ఫండ్ పథకం కింద కార్మికులకు రూ.81 లక్షలు చెల్లించాల్సి ఉంది. పావలా వడ్డీ రాయితీ రూ.3.56 కోట్లు, మార్కెటింగ్ ఇన్సెంటీవ్ కింద రూ.3.40 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉండగా నేతన్న నేస్తంతో వీటన్నింటికీ మంగళం పాడేశారు. బకాయిలను మాత్రం వైసీపీ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కోట్లాది రూపాయల ఆర్థిక భారం చేనేత సహకార సంఘాలపై పడింది.

కార్మికులకు ఉపాధి కల్పించే చర్యలు తీసుకోవాలి

దొంతంశెట్టి సత్యప్రకాష్
లివరీ చేనేత సహకార సంఘాల ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్



ఈ నెల 7వ తేదీతో చేనేత సహకార సంఘాల్లోని అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలం ముగిసింది. దాంతో సహకార సంఘాల్లో చెక్కులు జారీచేసే అధికారి గానీ, అనధికారిగానీ లేకపోవడంతో సొసైటీల సభ్యులు ఉపాధి కోల్పోయారు. అనధికార పాలకవర్గాలుగానీ, అధికార పర్సన్ ఇన్‌చార్జిలు గానీ లేని పరిస్థితి. అసలే అంతంతమాత్రంగా ఉన్న చేనేత పరిశ్రమను కాపాడే విధంగా కార్మికులకు ఉపాధి కల్పించేలా సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి. అవసరమైతే అప్పటివరకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను గానీ, పాలకవర్గాలను గానీ నియమించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ కూడా చెల్లించలేని పరిస్థితి సహకార సంఘాల్లో ఏర్పడింది. ఇప్పటికే చేనేత, జౌళి శాఖ మంత్రి సవితకు, ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ అందజేశాం.





ఆదివారపుపేట, అంగర చేనేత సహకార సంఘాల్లో పేరుకుపోయిన వస్త్ర నిల్వలు

జిల్లాలో 21 ఇసుక డీసిల్టేషన్ పాయింట్ల ఎంపిక

- మత్స్యకార సొసైటీల ద్వారా ఇసుక తవ్వకాలు
- భవిష్యత్తులో ఇసుక లభ్యతపై కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష

అమలాపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 21 ఇసుక డీసిల్టేషన్ పాయింట్లను ఎంపిక చేసినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. మత్స్యకార సొసైటీల ద్వారా ఇసుకను మాన్యువల్‌గా తవ్వకాలు జరిపి బోట్ల ద్వారా స్టాక్‌యార్డులకు తరలిస్తామన్నారు. జలవనరుల శాఖ అధికారులు 21 రీచ్‌లకు జియో కో-ఆర్డినేట్స్ రూపొందించి కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాలన్నారు. కపిలేశ్వరపురం ఇసుక స్టాక్ యార్డు రోడ్డుకు దిగువన లోతుగా ఇరుకుగా ఉండడంతో లోడింగ్ చార్జీ అదనంగా రూ.20 పెంచడానికి జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆమోద ముద్ర వేసిందన్నారు. శుక్రవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం ఆరు స్టాకు యార్డుల్లో ఇసుక సరఫరా, ఆన్‌లైన్ డిజిటలైజేషన్ ప్రక్రియ, అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులపై సమీక్షించారు. ఆధార్ కార్డుపై ఒక వ్యక్తికి రోజుకు 20 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరాపై సమీక్షించారు. ఏయే స్టాకు యార్డుల్లో ఇసుక నిల్వలు ఎంతమేర ఉన్నాయో ఆర్డీవోలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకార సొసైటీల ద్వారా స్టాకు యార్డులకు తరలించే ఇసుక రోడ్డుకు సమీపంలో ఉండేలా చూడాలన్నారు. కోస్టల్ రీజియన్ జోన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రవాణా ఏజెన్సీల ప్రతినిధులతో చార్జీల విషయమై చర్చించి నిర్దిష్టమైన ధరలను నిర్దేశించాలన్నారు. తదుపరి కమిటీ సమావేశంలో రవాణా ధరల పట్టికపై ఆమోదం తెలుపుతామన్నారు. స్టాకు యార్డుల వద్ద మూడు క్యూలైన్లను ఏర్పాటుచేసి పర్యవేక్షించేలా ఆర్డీవోలు, డీఎస్పీలు చర్యలు తీసుకోవాలన్నారు. రద్దీగా ఉండే ఇసుక స్టాకు యార్డుల్లో ఇసుక లావాదేవీలను తొలుత మాన్యువల్‌గా రిజిస్టర్‌లో నమోదు చేసి సాయంత్రం అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఉచిత ఇసుక విధానంలో భాగంగా మెట్రిక్ టన్నుకు రూ.245 వసూలు చేస్తున్నామని, కపిలేశ్వరపురంలో అయితే రూ.265 వసూలు చేసేలా కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. జిల్లాలో కాంట్రాక్టర్లు, బిల్డర్ల వద్ద పదిచోట్ల ఇసుక నిల్వలు అక్రమంగా ఉన్నట్టు ఖనిజాభివృద్ధి సంస్థ గుర్తించిందన్నారు. సంబంధిత వివరాలను పరిశీలించి మూడు రోజుల్లో నివేదిక అందిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులకు తెలిపారు. మత్స్యకార సొసైటీల వద్దనున్న బోట్‌లు ఇసుక తవ్వకాలకు అనువుగా ఉన్నదీ లేనిదీ, చట్టబద్ధమైన అనుమతులకు సంబంధించిన ధ్రువపత్రాలపై నివేదిక సమర్పించాలన్నారు.



ఇసుక కమిటీ సమావేశంలో సూచనలు చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవోలు జి.కేశవర్ధనరెడ్డి, ఎస్.సుధాసాగర్, జీవీవీ సత్యనారాయణ, జిల్లా ఖనిజాభివృద్ధి సంస్థ అధికారి సాయిరాంసింగ్, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ సందీప్‌రెడ్డి, గోదావరి హెడ్‌వర్క్స్ ఈఈ కె.కాశీవిశ్వేశ్వరరావు, డీపీవో డి.రాంబాబు, డీటీవో అశోక్‌ప్రతాప్‌రావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ బి.రాము, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ సురేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఎటువంటి ఆదాయాన్ని ఆశించకుండా వినియోగదారుల కోసం ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు. శుక్రవారం అమరావతి నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో అమలాపురంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మహేష్‌కుమార్ పాల్గొన్నారు. జిల్లాలో భవిష్యత్తులో ఇసుక లభ్యత, ఇసుక నిల్వలపై వారంవారం సమీక్షలు నిర్వహించాలని సూచించారు. అక్రమ ఇసుకపై పూర్తి నియంత్రణ ఉండాలన్నారు. సమర్థవంతమైన విజిలెన్స్ అండ్ మోనటరింగ్ మెకానిజం ద్వారా అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



గాజుల గౌరీదేవిగా...

ఆషాఢ మాసం మూడవ శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీదేవి మార్కెట్ సెంటర్లోని శ్రీదేవి అమ్మవారికి తెల్లవారుజామున విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 20వేల రంగురంగుల గాజులతో అమ్మవారికి అలంకరణ చేశారు. ఉదయం ఆరు గంటల నుంచి శ్రీదేవి అమ్మవారు గాజుల గౌరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

\- అమలాపురం టౌన్



సంధిపూడిలో వైద్య సేవలను పరిశీలిస్తున్న వీరబాబు

గ్రామీణులకు వైద్య సేవలు సక్రమంగా అందించాలి

జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి వీరబాబు

ఆలమూరు, జూలై 26: గ్రామీణ ప్రాంతాల్లో అమలు జరుగుతున్న వైద్య సేవలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి కె.వీరబాబు తెలిపారు. గ్రామాల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది సక్రమంగా సేవలందిస్తేనే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. మండలంలోని సంధిపూడిలో శుక్రవారం ఏర్పాటుచేసిన ఆయుష్మాన్ భారత్ మందిర్ వైద్య సేవలను వీరబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి అక్కడ ఉన్న ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు అందించాల్సిన టీకాలు, గర్భిణులు, బాలింతలతో రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్న తరుణంలో క్షేత్రస్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయికిషోర్‌లకు సూచించారు. డీటీవో వెంట సూపర్‌వైజర్లు ఉమ, శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీలు సువర్చల, ఆర్.భాను, ప్రియాంక వున్నారు.

కాకినాడలోని పురాతన కట్టడాలను సంరక్షించుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్రసింగ్

- రామన్ మెగసెసె అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్

జేఎన్టీయూకే, జూలై 26: కాకినాడ నగరంలోని పురాతన సంపద, కట్టడాలను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వాటర్‌మెన్ ఆఫ్ ఇండియా రామన్ మెగసెసె అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్ అన్నారు. వర్సిటీలోని సెనేట్ హాల్లో జేఎన్టీయూకే, పీడబ్ల్యూసీడీఎఫ్ సంస్థల ఆధ్వర్యంలో వారసత్వ సంపద భవిష్యత్తు, కార్యాచరణ అనే అంశంపై శుక్రవారం నగర ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి చీఫ్ ఇంజనీర్ వి.శ్రీనివాసులు, పీడబ్ల్యూసీడీఎఫ్ సమన్వయకర్త పి.ఆదినారాయణ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రాజేంద్రసింగ్, విశిష్ట అతిథిగా ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, గౌరవఅతిథులుగా సామాజిక కార్యకర్త, జనసేన పార్టీ సీనియర్ నేత బొలిశెట్టి సత్యనారాయణ, సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, పర్యావరణవేత్తలు రత్నం, మృత్యుంజయరావు పాల్గొన్నారు. రాజేంద్రసింగ్ మాట్లాడుతూ కాకినాడలో పురాతన కళాశాలలు, జాతీయ వారసత్వ సంపద, మడ అడవులు ఉన్నాయన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ వర్సిటీలో 75ఏళ్లు దాటిన అతిపెద్ద వృక్షాలున్నాయని, వాటిని సంరక్షించేందుకు ప్రతిఏటా పెన్షన్ ఇస్తున్నామన్నారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మడ అడవుల్లోని ప్రతిజీవి వారసత్వ సంపదేనని తెలిపారు. సత్యనారాయణ మాట్లాడుతూ మడ అడవులు, హోప్ ఐలాండ్‌వల్ల కాకినాడ నగరం సంరక్షింపబడుతోందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీరమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఓఎస్డీ కోటేశ్వరరావు, అధ్యాపకులు, పర్యావరణవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యదేవుడి విమానగోపురం స్వర్ణమయానికి
కొలతలు తీసిన టీటీడీ బృందం


సత్యదేవుడి విమానగోపురం కొలతలు తీసుకుంటున్న టీటీడీ బృందం

- అంచనా వ్యయం రూ.10కోట్లకు పెరిగే అవకాశం

అన్నవరం, జూలై 26: రత్నగిరివాసుడైన సత్యదేవుడి విమానగోపురం స్వర్ణమయం చేసేందుకు అడుగులు వడివడిగా పడుతున్నాయి. ఇప్పటికే ఒక పర్యాయం దేవదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప నేతృత్వంలో ఒక కమిటీ పరిశీలన జరిపి సుమారు 11కేజీల బంగారం పడుతుందని అంచనా వేయగా దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో శుక్రవారం టీటీడీ డిప్యూటీ ఈఈ చంద్రమౌళీరెడ్డి, అసిస్టెంట్ స్థపతి మురళీశంకర్, అప్రయిజర్ నాగరాజు, సూపరింటెండెంట్ మనోహర్‌ల బృందం విమానగోపురం కొలతలను తీసుకున్నారు. విమానగోపురంపై దేవతామూర్తుల విగ్రహాలు ఉండడంతో ప్రతీ అంగుళం కొలతలు తీసుకున్నారు. 10 అడుగుల వెడల్పు, 12 అడుగుల ఎత్తు ఈ ఆలయశిఖరంపై సుమారు 50 దేవతామూర్తులు విగ్రహాలున్నాయి. అప్పటి అంచనా ప్రకారం సుమారు 7.5 కోట్లు కాగా, ప్రస్తుతం ధరలు అప్పటితో పోల్చితే పెరగడం, దేవతామూర్తుల విగ్రహాలు కొలతలు ప్రాథమికంగానే తీసుకోవడంతో అంచనా వ్యయం సుమారు రూ.10 కోట్లకు చేరుతుందన్నారు. దీనిపై దేవస్థానం ఈవో రామచంద్రమోహన్‌తో చర్చించి నివేదకను దేవదాయకమిషనర్‌కు అందజేస్తామని బృందసభ్యులు తెలిపారు. ఈనెల 30న అంచనా వ్యయం రిపోర్టు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారెడ్డి తదితరులున్నారు.

మెడికల్ ఆఫీసర్‌ను వేధించి
తిరిగి తప్పుడు ఆరోపణలు

- ఏపీపీహెచ్‌సీడీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు
- సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీపీహెచ్‌సీడీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

కాకినాడ సిటీ, జూలై 26: జిల్లా ఫైలేరియా విభాగంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కె.రాధాకృష్ణ కనిపించకపోవడానికి ఎఫ్ఆర్‌టీసీ మెడికల్ ఆఫీసర్ వేధింపులే కారణమని తప్పుడు ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.రవికుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఆర్ పవన్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్ర వారం వారు కలెక్టర్‌ను కలిసి ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సదరు మెడికల్ ఆఫీసర్‌ను కలిసి తాము విచారించామని, రాధాకృష్ణ తనపట్ల అసభ్యకరంగా ప్రవర్తించగా ఆ విషయాన్ని డీఎంహెచ్‌వో, ఆర్డీల దృష్టికి తెచ్చానని తెలిపారన్నారు. దీనిపై విచారణ అధికారి విచారణచేసి డీఎంహెచ్‌వో, ఆర్డీలకు నివేదిక సమర్పించినట్లు వివరించారన్నారు. ఇది జరిగిన తర్వాత రాధాకృష్ణ కనిపించకపోవడంతో దాన్ని ఆసరాగా చేసుకుని తిరిగి బాధితురాలైన వైద్యాధికారిణిపై ఆరోపణలు చేస్తుండడంతో ఆమె ఒత్తిడికి గురవుతున్నారన్నారు. కానీ వాస్తవానికి ఇబ్బంది పడింది ఆ మహిళా వైద్యాధికారిణే అన్నారు. ఆమెకు జరిగిన అన్యాయానికి న్యాయం జరగకపోగా తిరిగి ఆమెపై నిందలు మోపుతున్నారన్నారు. ఒక మహిళా అధికారికి పనిచేసే స్థలంలో సరైన భద్రత లేకపోవడంతో మిగిలిన మహిళా అధికారులకు అభద్రతాభావం కలుగుతోందన్నారు. దీన్ని తమ అసోసి యేషన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వో లను కలిసి సమగ్ర విచారణ జరిపి తగు న్యాయం చేయాలని కోరామన్నారు. దీనిపై కలెక్టర్, డీఎంహెచ్‌వో సానుకూలంగా స్పందించారని ఏపీపీహెచ్‌సీడీఏ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ తెలిపారు.

తగ్గుతూ... పెరుగుతూ గోదావరి

- ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- కాటన్‌బ్యారేజ్ నుంచి 12.44లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ


నాటుపడవపై చింతరేగుపల్లి చేరుకుంటున్న వరద బాధితులు


చింతూరులో మల్లెతోటకు విద్యుత్ సరఫరాకోసం మరమ్మతులు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది


ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద వరద ఉధృతి

ధవళేశ్వరం, జూలై 26: వారం రోజులుగా గోదావరి ఉధృతి తగ్గుతూ పెరుగుతూ ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వచ్చి చేరే వరదనీరు ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి ప్రవహించేలోగా మరలా ఎగువన నీటి మట్టం పెరుగుతుంది. దీంతో ఎగువన భద్రాచలం వద్ద, దిగువన ధవళేశ్వరం వద్ద ప్రమాదహెచ్చరికలు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం మధ్యాహ్నానికి 2గంటలకు 13.40అడుగుల వరకు తగ్గిన నీటి మట్టం 12గంటలు పాటు నిలకడగా కొనసాగింది. ఆపై స్వల్పంగా పెరుగుతూ 15గంటల వ్యవధిలో 3 పాయింట్లు పెరిగి శుక్రవారం సాయంత్రం 5గంటలకు 13.70అడుగులకు చేరింది. మరలా తగ్గుముఖం పట్టి రాత్రి 7గంటలకు 13.50 అడుగులుగా ఉంది. కాటన్ బ్యారేజ్ నుంచి 12,44,232 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఇదే సమయంలో భద్రాచలం వద్ద నీటి మట్టం రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 48.60 అడుగులకు చేరుకుంది.

మళ్లీ పెరుగుతున్న గోదావరి, శబరి

చింతూరు, జూలై 26 : తగ్గినట్టే తగ్గిన గోదావరి, శబరి నదులు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి అతి చేరువగా 48. 60 అడుగులకు చేరుకుంది. ఇక చింతూరు వద్ద శబరి నది 37.5 అడుగులకు చేరింది. దీంతో రహదారులు ఇంకా ముంపులోనే ఉండి రాకపోకలు దాదాపు వారం రోజులుగా స్తంభించిపోయాయి. ముంపు బాధితులతో పాటు అధికార యంత్రాంగం నాటు పడవలనే ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. పలు గ్రామాలకు చెందిన విద్యుత్ సరఫరా లైన్లు నీటమునగడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది ముంపునకు గురైన విద్యుత్ స్థంభాల వద్దకు నాటు పడవలపై చేరుకొని ఆయా స్థంబాలను హైట్ టి రైజర్ల ద్వారా ఎత్తు పెంచి విద్యుత్ సరఫరా ఇచ్చే దిశగా చర్యలు చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి జీఎల్ఎన్‌వి రాఘవన్ బృందం ముంపు ప్రాంతాలలో సందర్శించి పారిశుధ్యం చర్యలు చేపట్టే దిశగా చర్యలు చేపట్టారు. అదే దశలో విస్తృతంగా మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయించారు.

హత్యకేసులో తండ్రితో సహా
కుమారులకు యావజ్జీవ శిక్ష

ద్రాక్షారామ, జూలై 26 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా రామచంద్రపురం మండలం యనమదలలో సాదే జనార్ధనరావు హత్యకేసులో అదే గ్రామానికి చెందిన దారా అప్పారావు అతని కుమారులు దారా సింహాద్రి, దారా చంటి, దారా రాజశేఖర్‌లకు యావజ్జీవ కారాగార శిక్ష రూ.5వేలు చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి ఆర్.శ్రీలత శుక్రవారం తీర్పు చెప్పారు. ద్రాక్షారామ ఎస్ఐ జి.సురేంద్ర తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యనమదల గ్రామానికి చెందిన దారా అప్పారావుకు చెందిన పాడె గేదెలు సాదె జనార్ధనరావుకు చెందిన భూమి సరిహద్దులోకి వెళ్లి మొక్కలు పాడుచేస్తున్న విషయమై ఇరువురికి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 2015 సెప్టెంబరు 6న మధ్యాహ్నం 2 గంటలకు సాదె జనార్ధనరావుకు చెందిన స్థలంలోకి దారా అప్పారావు అతని కుమారులు దారా సింహాద్రి, దారాచంటి, దారా రాజశేఖర్‌లు కత్తులు, కర్రలతో అక్రమంగా ప్రవేశించి సరిహద్దులో కర్రల దడిపాడు చేసి సాదె జనర్ధానరావుకు చెందిన చింతచెట్టును నరికి పాడు చేస్తుండగా సాదె జనార్ధనరావు అతని కుమారులు వెళ్లి దౌర్జన్యంపై ప్రశ్నించగా దారా సింహాద్రి కత్తితో సాదె జనార్ధనరావును మెడ వెనుక చావరా అంటూ నరికాడు. దీంతో సాదె జనార్ధనరావు రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతి చెందాడు. సాదె జనార్ధనరావు రెండవ కుమారుడు దుర్గాప్రసాద్ ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ కె.వంశీధర్ కేసు నమోదు చేయగా సీఐ పి.కాశీవిశ్వనాధం కేసు దర్యాప్తుచేసి సాక్ష్యాధారాలతో చార్జిషీటు దాఖలు చేశారు. రాజమహేంద్రవరం 10వ ఏడీజే ఎస్సీ, ఎస్టీ కోర్టు లో స్పీడ్ ట్రయల్ నిర్వహించగా నేరం రుజువు కావడంతో నింది తులు నలుగురికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5వేలు చొప్పన జరిమానా విధిస్తూ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారు. ఈ కేసులో కేసు నమోదుచేసిన ఎస్ఐ వంశీధర్, సీఐ పి.కాశీవిశ్వనాధరావు, స్పీడ్ ట్రయల్ నందు కృషి చేసిన ఎస్ఐ జి.సురేంద్రను ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

విద్యుత్ సిబ్బంది సాహసం

- ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన రామయ్య


రోప్ సహాయంతో రిస్క్ చేసి కాలువ దాటుతున్న విద్యుత్ సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ, జూలై 26 : ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. మారుమూల గిరిజన ప్రాంతాలలో విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలోని విద్యుత్ సిబ్బంది సాహసోపేతంగా ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్నారు. రంపచోడవరం డివిజన్‌కు చెందిన మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో బుధవారం సున్నంపాడు గ్రామానికి విద్యుత్ సిబ్బంది వెళ్లి ఫీడర్ లైన్‌పై వెదురు బొంగులు ఇతర చెట్లు పడిపోవడంతో అక్కడ ఆగిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సుమారు 800 మందిజనాభా కలిగిన సున్నంపాడు, దేవరపల్లి గ్రామాలకు కాలువను తమ జెఎల్ఎమ్ కూర రామయ్య విద్యుత్ కండక్టర్ సహాయంతో దాటి విద్యుత్ సరఫరాను అందించినట్లు ఏపీ ఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ టీవీఎస్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా రామయ్యను ఎస్ఈ అభినందించారు. సహకరించిన గ్రామస్తులకు ధన్యవాదలు తెలిపారు.

మహిళపై గొడ్డలితో దాడి

- తీవ్రంగా గాయపడ్డ మహిళ
- సరిహద్దు గోడ వివాదమే కారణమా


తీవ్రంగా గాయపడిన మహిళ, ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, జూలై 26: పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని ఇంటి పక్కనే ఉంటున్న మహిళపై ఒక వ్యక్తి గొడ్డలితో విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం తొలుత పిఠాపురం, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని రంగప్పచెరువు వీధిలో వాటర్‌ట్యాంకు ఎదురుగా నేకూరి రాజ్యలక్ష్మి తన భర్త, కుమారులతో కలిసి అద్దె ఇంటిలో నివాసముంటున్నది. వీరికి సమీ పాన వేమగిరి రాజేష్ అతని తల్లితో కలిసి ఉంటున్నాడు. వాళ్లింటిని ఎడమవైపున రాజ్యలక్ష్మి కుటుంబానికి ఖాళీస్థలం ఉంది. ఈ స్థలం లోకి వచ్చి గోడ కట్టుకున్నారంటూ రాజేష్‌కు. రాజ్యలక్ష్మి కుటుంబానికి మధ్య వివాదం కొంతకాలంగా ఉంది. ఈ విషయంలో పెద్ద మనుషుల్లో పెట్టగా గోడను సరిచేసుకోవాలని వారు రాజేష్‌కు సూచించారు. దీంతో రాజేష్ కక్ష పెంచుకుని అప్పటి నుంచి అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. భర్త వ్యవసాయ పనులకు వెళ్లి రాజ్యలక్ష్మి ఇంటి వద్ద బయట టీ పెట్టుకుంటున్నది. దీనిని గమనించి రాజేష్ తన తల్లి లక్ష్మీతో ఆమె వద్దకు వెళ్లి అకస్మాత్తుగా గొడ్డలితో తలపై, శరీరంపై పలుచోట్ల విచక్షణా రహితంగా నరికాడు. దీంతో తీవ్రంగా గాయపడి రక్తపుమడుగులో ఉన్న ఆమెను తొలుత పిఠాపురం అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా రాజేష్ ఇదే తరహాలో నాలుగేళ్ల క్రితం తన మేనమామ ద్రాక్షారపు భూషణంపై దాడి చేయగా దీనిపై కేసు నమోదైంది. మహిళపై గొడ్డలితో దాడిచేసిన సంఘటన పట్టణంలో సంచలనం కలిగించింది. పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ జాన్‌భాషాలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాత్రి రాజేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


దొంగ రవిదుర్గాగణేష్

అమలాపురంరూరల్, జూలై 26: స్నేహితులిద్దరూ పని ముగించుకుని ఇంటికి వెళుతుండగా రోడ్డు బెర్ములో మోటారు సైకిల్ అదుపు తప్పి బోల్తా కొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా మరొకరు తీవ్ర గాయాలతో అమలాపురం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణ సీఐ కె.క్రిస్టఫర్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంరూరల్ పేరూరు తోట్లపాలేనికి చెందిన దొంగ రవిదుర్గాగణేష్ (26) తాపీ పనిచేస్తుండగా స్నేహితుడైన గెద్దాడ ఓంసాయి ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం పని ముగించుకుని మోటారు సైకిల్‌పై ఇంటికి వస్తుండగా ఒక్కసారిగా మోటారు సైకిల్ అదుపుతప్పి బోల్తా కొట్టడంతోదుర్గాగణేష్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఓంసాయి తీవ్ర గాయాలపాలు కాగా స్థానికులు హుటాహుటిన ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవపంచనామా పూర్తిచేసి దుర్గాగణేష్ మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ క్రిస్టఫర్ తెలిపారు. మృతుడికి తల్లి శ్యామల, తండ్రి సత్యనారాయణతో పాటు సోదరుడు ఉన్నారు. తల్లిదండ్రులతో పాటు దుర్గాగణేష్ ఏరోజుకారోజు కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. చేతికందిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

స్వదేశానికి వీరేంద్రకుమార్

- మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపిన వీరేంద్ర


హైదరాబాద్‌లోని కుటుంబ సభ్యులతో వీరేంద్రకుమార్

అంబాజీపేట, జూలై 26: ఏజెంట్ మోసంతో సౌదీలో చిక్కుకుని నరక యాతన పడిన సరెళ్ల వీరేంద్రకుమార్ మంత్రి నారా లోకేశ్ కృషితో స్వదేశానికి చేరుకున్నాడు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామానికి చెందిన వీరేంద్రకుమార్ సౌదీలో ఒంటెల కాపరిగా ఉండి తాను పడుతున్న ఇబ్బందులను సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వానికి తెలియజేసినవిషయం విదితమే. ఈమేరకు మంత్రి నారా లోకేశ్ స్పందించి అక్కడి టీడీపీ ఎన్ఆర్ఐలు, జిల్లా కలెక్టర్, అధికారులు ఏంబీసీతో మాట్లాడి స్వదేశానికి తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు వీరేంద్ర హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో దిగాడు. అక్కడ కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించి హైదరాబాద్‌లో ఉన్న బంధువుల ఇంటికి చేరుకున్నాడు. అక్కడ వైద్య పరీక్షలు చేయించుకుని స్వగ్రామానికి చేరుకుంటానని వీరేంద్ర తెలిపారు. తనని స్వదేశానికి తీసుకువచ్చిన ఆంధ్రప్రదేశ్ కూటమి, ప్రభుత్వానికి, మంత్రి నారా లోకేశ్‌కు వీరేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

ప్రియుడి వేధింపులు తాళలేక గర్భిణి ఆత్మహత్య

నల్లజర్ల, జూలై 26: ప్రియుడి వేధింపులు తాళలేక మూడు నెలల గర్భిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పోతవరంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. పోతవరం గ్రామానికి చెందిన బాకీ వెంకట్రావు, నాగలక్ష్మి దంపతుల ఏకైక కుమార్తె విజయదుర్గ(21) ఈ ఏడాది మార్చి నెల వరకు గ్రామంలో వలంటీర్‌గా పనిచేసింది. ఏప్రిల్ 3న ఏలూరు జిల్లా పూళ్ల గ్రామానికి చెందిన లక్ష్మణ్‌ఈశ్వర్‌తో వివాహం జరిగింది. ఆషాఢ మాసం కావడంతో విజయదుర్గ పుట్టింటికి పోతవరం వచ్చింది. అదే గ్రామానికి చెందిన ప్రియుడు సిమెంట్ పనులకు వెళ్లే దెబ్బెం ధనరాజు వేధింపులకు పాల్పడుతున్నాడు. విజయదుర్గ తనకు పెళ్లయిందని ఇంతటితో వదిలేయమని ప్రాధేయపడింది. అయినా పట్టించుకోకుండా పదే పదే వేధించడంతో హెచ్చరించింది. దీంతో ధనరాజు గతంలో తనతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు, ఫోన్ సంభాషణ పూళ్లలో ఉంటున్న విజయదుర్గ భర్తకు పం పించాడు. దీంతో భర్త ఫోన్‌లో మందలించడంతో వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. జీవితంపై విరక్తి చెందిన విజయదుర్గ బుధవారం ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్యహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వచ్చి ముందుగా నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆపై మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

ప్రత్తిపాడులో
వైద్య ఉద్యోగి ఇంట్లో చోరీ

- రూ.7లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరణ


చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పెద్దాపురం డీఎస్పీ ప్రత్తిపాడు సీఐల బృందం

ప్రత్తిపాడు, జూలై 26: కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో వైద్యఉద్యోగి ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో రూ.7లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదు దొంగలు అపహరించారు. గురువారం సాయంత్రం జరిగిన ఈ చోరీ ఘటనకు సంబంధించి బాధితుల ఫిర్యాదుల మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ప్రత్తిపాడులోని ఫైర్‌స్టేషన్ సమీపంలో వైద్య ఉద్యోగి మచ్చికర్ల అప్పలస్వామి, భార్య సత్యకాంత ఇరువురు పిల్లలతో డాబా ఇంట్లో నివసిస్తున్నారు. దేవీపట్నం మండలం ఇందుకూరుపేట పీహెచ్‌సీలో మచ్చకర్ల అప్పలస్వామి ఫార్మశిస్టుగా పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం ఇంటివద్ద ఉన్న అతని భార్య సత్యకాంత స్థానిక బస్టాండ్ సమీపంలోని తన తల్లి నిర్వహిస్తున్న దుకాణం వద్దకు వెళ్లింది. అదే సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో భద్రపరిచిన రూ.3లక్షల నగదుతోపాటు రూ.4లక్షలు విలువచేసే 12రకాల బంగారు ఆభరణాలు చోరీకి పాల్పడ్డారు. డాబాపై ఫస్ట్‌ఫ్లోర్ నిర్మాణ పనులు ఒకవైపు జరుగుతున్నా కింది ఫ్లోర్‌లో తలుపులకు తాళాలు వేసినా దుండగలు చాకచక్యంగా లోపలకి వెళ్లి ఈ చోరీకి పాల్పడ్డారు. ఇందుకూరుపేట పీహెచ్‌సీ నుంచి అప్పల స్వామి ప్రత్తిపాడు చేరుకుని తన ఇంటిపై జరుగుతున్న నిర్మాణ పనులు పరిశీలించేందుకు వెళుతూ కిటికీలోంచి బెడ్‌రూంలోని వస్తువులు చిందరవందరగా ఉండటాన్ని గమనించి మెయిన్ డోర్ తాళాలు తీసి పరిశీలించగా చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువాలో ఉన్న రూ.3లక్షల నగదుతో పాటు రూ.4లక్షలు విలువచేసే 20 కాసుల బంగారు నెమలి లాకెట్, రెండు రకాల నల్లపూసల తాళ్లు, రెండు రకాల చెవిదిద్దులు, బ్రాస్‌లెట్‌లు, చైన్‌లు, మూడు ఉంగరాలు, రెండు రూపులు, గ్రీన్‌స్టోన్ చెవిదిద్దులు తదితర వస్తువులు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పట్టపగలు తమ ఇంట్లో మూసిన తలుపులు మూసినట్లు వేసిన తాళాలు వేసినట్లు ఉండగా దుండగలు ఏ విధంగా చోరీకి పాలపడ్డారో అర్థం కావడంలేదని బాధితులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని శుక్రవారం సాయంత్రం పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం ఎస్ఐలు ఎం.పవన్‌కుమార్, జి.సతీష్‌లు సందర్శించారు.కాకినాడ నుంచి క్లూస్ టీం, వేలిముద్ర నిపుణులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధాని మన్ననలను పొందిన
పెయింటింగ్


నరేంద్రమోదీ మనసు దోచిన హరి తాడోజు పెయింటింగ్ ఫోటో

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 26: ప్రధాని నరేంద్ర మోదీ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేసిన ప్రముఖ చిత్రకారుడు, స్ట్రోకర్స్ అధినేత హరి తాడోజు పెయింటింగ్ ప్రధాని మన్ననలు పొందింది. ఇటీవల ప్రధాని కన్యాకుమారిలో ధ్యానం చేస్తున్నట్లున్న చిత్రాన్ని మాజీ ప్రధాని హెచ్‌డీ దేవగౌడ.. హరి తాడోజుతో వేయించుకొని, తనను కలిసిన ప్రధాని నరేంద్ర మోదీకి పెయింటింగ్‌ని బహూకరించారు.. ఆ విషయాన్ని ప్రధాని మోదీ తనట్విట్టర్ ఖాతాలో పోస్టుచేశారని, ఈ విషయంతనకు ఎంతో సంతోషాన్ని చ్చిందని హరి తాడోజు తెలిపారు. ప్రధాని మనసు దోచిన ఈ పెయింటింగ్‌ను చూసి మిత్రులు హరి తాడోజుకు అశేషంగా అభినందనలు తెలుపుతున్నారు.

పోలవరం నిర్వాసితులను కాపాడండి

- తొలిసారి అసెంబ్లీలో గళం విప్పిన రంప ఎమ్మెల్యే మిరియాల శిరీష


అసెంబ్లీలో మాట్లాడుతున్న రంప ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం/చింతూరు జూలై26: పోలవరం ప్రాజెక్టు, గోదావరి వరదల మూలంగా ఇబ్బందులు పడుతున్న రంపచోడవరం నియోజకవర్గంలోని గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను కాపాడాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాలు ముగిసిపోతున్న వేళ చివరిగా తనకు వచ్చిన కొద్దిపాటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆమె పలు సమస్యలను లేవనెత్తారు. నాలుగు విలీన మండలాల్లోని 130 ఆవాసాలలో 34 వేల కుటుంబాలు వరదల ప్రభావానికి గురయ్యారన్నారు. ఈ గ్రామాల్లో ఎక్కడా శాశ్వత వరద పునరావాస కేంద్రాలు లేకపోవడంతో వరదలు వచ్చిన ప్రతిసారీ కొండలపైనే తలదాచుకుంటున్నారన్నారు. గత 15 సంవత్సరాలుగా ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో లేదని, 10 సంవత్సరాలుగా వైసీపీ అధికారంలో కొనసాగిందని, ఫలితంగా ఇక్కడి ప్రజలను పట్టించుకునే వారే లేరన్నారు. సరైన వరద సహాయం అందని పరిస్థితులను వైసీపీ పాలనలో ఎదుర్కొన్నామని, దోమ తెరలూ కూడా ఇవ్వలేదని అన్నారు. ఈ వరదల్లో కలెక్టరు ఏర్పాట్లు చేసినా నిత్యావసర వస్తువులు అందుబాటులో లేని పరిస్థితులు ఉన్నాయన్నారు. అక్కడి ప్రజలకు హామీ ఇచ్చి తాను అసెంబ్లీలో అడుగుపెట్టానని, అనేక సమస్యలతో తన నియోజకవర్గం ఉన్నదన్నారు. పోలవరం కింద నిర్వాసితులకు సురక్షిత ప్రాంతాలలో వారు కోరుకున్న చోట పునరావాస కాలనీలను నిర్మించాలని కోరారు. పోలవరం తమకు వరమా లేక శాపమా అని ఈ నాలుగు విలీన మండలాల ప్రజలూ భావిస్తున్నారన్నారు. ఇక జి.ఓ.నెం.3 పునరుద్ధరణ అవసరాన్ని కూడా ఆమె ప్రస్తావించారు. ప్రభుత్వం చేపట్టబోయే మెగా డీఎస్సీలో జీవో నెం.3లోని ఫలాలు అందేలా చూడాలని కోరారు.

పందుల పందేలపై దాడి.. ఐదుగురి అరెస్టు

ముమ్మిడివరం, జూలై 26: కొత్తలంక శివారు పచ్చమట్లవారిపాలెంలో పందుల పందేలు నిర్వహిస్తున్న శిబిరంపై పోలీసులు దాడిచేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పచ్చమట్లవారిపాలెం కొబ్బరితోటలో శుక్రవారం పందుల పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1800 నగదు స్వాధీనం చేసుకున్నారు. సంఘటనా స్థలంలో 7 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆల్ ది బెస్ట్ ఇండియా

అమలాపురం టౌన్, జూలై 26: ఒలింపిక్స్ ప్రారంభం సందర్భంగా అమలాపురం గొల్లగూడెంలోని ఆదిత్య పాఠశాలలో వేడుకల సందడి నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.లక్ష్మీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఆల్ ది బెస్ట్ ఇండియా గోఫర్ గోల్ నినాదంతో క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. దేశం తరపున పోటీలో పాల్గొంటున్న క్రీడాకారులు విజయం సాధించాలని విద్యార్థులు ఆకాంక్షించారు. విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ ఎస్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎస్.శృతిరెడ్డి అభినందించారు.

తేరుకుంటున్న లంక గ్రామాలు

ముమ్మిడివరం, జూలై26: గోదావరి ఎగువన ధవళేశ్వరం వద్ద వరద ప్రవాహ ఉధృతి తగ్గడంతో దిగువనున్న ముమ్మిడివరంలోని లంక గ్రామాలు వరద ముంపు నుంచి బయట పడుతున్నాయి. గురువారం నాటికన్నా శుక్రవారం మరో రెండు అడుగుల నీటిమట్టం తగ్గింది. ప్రవాహ వేగం కూడా తగ్గింది. వివేకానంద వారధి నుంచి గురజాపులంక వెళ్లే ప్రధాన సిమెంటు రోడ్డు వరద నీటి నుంచి బయట పడుతుంది. కూనాలంక రామాలయం వద్ద, గురజాపులంక తుపాను షెల్టర్ సమీపంలో సిమెంటు రోడ్డుపై నుంచి కొద్దిగా వరదనీరు ప్రవహిస్తుంది. దీంతో వరద నీటిలో మునిగిన బీర, బెండ, వంగ, మిర్చి, ఆనబ, అరటి తదితర పంటలు బయట పడుతున్నాయి. వరద సహాయక ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, తహసీల్దార్ బి.శ్రీనునాయక్, వీఆర్వోలు వరద ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. లంకగ్రామాల్లో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. బాధితులకు తాగునీరు యథావిధిగా సరఫరా చేస్తున్నారు.



రావులపాలెం గౌతమి వంతెన సమీపంలో వరద ముంపులో చిక్కుకున్న పంట పొలాలు

గ్రామాల్లోని కూరగాయల తోటలకు అపారనష్టం వాటిల్లే ఆస్కారం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరుతున్నారు. వరదకు ప్రత్యేకాధికారిగా నియమితులైన ఆర్డీవో కేశవర్ధనరెడ్డి అప్పనపల్లి కాజ్‌వే వద్ద వరద పరిస్థితిపై సమీక్షించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ అలీ, వీఆర్వో నారాయణ, సిబ్బంది ఉన్నారు.

నీట మునిగిన ఇళ్లు

అంబాజీపేట, జూలై 26: ఎగువన కురిసిన భారీ వర్షాలతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. మండలంలోని నదీతీర ప్రాంతం నందంపూడిలోని బొంతువారిపేటలో ఇళ్లు నీట మునిగాయి.దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి వి.గౌతమి తెలిపారు. అప్పర్‌కౌశికలు పొంగి ప్రవహిస్తున్నాయి. వాకలగరువు, తొండవరం, నందంపూడి గ్రామాల్లోని కొబ్బరి, అరటి తోటల్లో వరద నీరు భారీగా చేరింది. వాకలగరువు ఏటిగట్టు వద్ద ఉన్న కొబ్బరి చెట్లు నదీగర్భంలో కలిసిపోతున్నాయి. ముంపు ప్రాంతాలను ఎంపీడీవో జీవీసరోవర్ పరిశీలించారు. ఈవోపీర్డీ మమత, కార్యదర్శులు జీజీవీకే కుమార్, లక్ష్మీపతి ఉన్నారు.

స్వల్పంగా తగ్గుతున్న గోదావరి

మామిడికుదురు, జూలై 26: గోదావరికి వరద నీటిమట్టం స్వల్పంగా తగ్గుతుండడంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. అప్పనపల్లి కాజ్‌వే ఇంకా జల దిగ్బంధంలోనే కొనసాగుతుంది. భద్రాచలంలో వరద నీటి మట్టం తగ్గుతున్నప్పటికీ ధవళేశ్వరం నుంచి వచ్చే వరదనీరు పెరుగుతుందని లంక గ్రామాలు ప్రజలు పేర్కొంటున్నారు. వరద తగ్గితే నష్టాలు బయట పడతాయని, లంక

తగ్గుముఖం పట్టిన వరద

అంతర్వేది, జూలై 26: సఖినేటిపల్లి మండలంలో లంక గ్రామాలు టేకిశెట్టిపాలెం అప్పనరామునిలంక, సఖినేటిపల్లి లాకోపేట, సఖినేటిపల్లింకల్లో వరద తగ్గుముఖం పట్టింది. పెదలంక, కొత్తలంక, బాడిరేవు, లాకోపేటకు వరద అధికంగా చేరడంతో రహదారులన్నీ వరదతో నిండి ఉన్నాయి. మత్స్యశాఖ ఏర్పాటుచేసిన పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఆ పడవలపై ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోల సాయంతో వారికి తాగునీరు, వైద్య సదుపాయాలు అందిస్తున్నట్టు తహసీల్దార్ పెద్దిరాజు, ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, ఏపీవో నాగప్రసాద్, కార్యదర్శి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరద నీటిలో ఇటుకబట్టీలు

కపిలేశ్వరపురం, జూలై 26: వరద గోదావరి శుక్రవారం తగ్గుముఖం పట్టింది. వరద ఉధృతి తగ్గినప్పటికీ లంక పొలాల్లోని అరటి, కొబ్బరి, కంద, వంగ, బెండ, దొండ తదితర పంటలు ముంపునీటిలోనే ఉన్నాయి. వరద నీటి ప్రవాహం తగ్గడంతో పడవల్లో రైతులు లంకల్లో వేసిన పంటల వద్దకు వెళ్లి పంటను ఒడ్డుకు చేర్చుకుని ఒబ్బిడి చేసుకుంటున్నారు. కొన్ని పంటలు పూర్తిగా పాడైపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇటుకబట్టీలు కూడా వరదనీటిలో ఉన్నాయి. అధికారులు లంకగ్రామాల్లో పర్యటించి పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ముంపునకు గురైన వరి చేలు క్రమక్రమంగా బయటపడుతున్నాయి. వరి పంట పనికిరాకుండా పోతాదని రైతులు వాపోతున్నారు.

నిలకడగా గోదావరి వరద

ఆలమూరు, జూలై 26: గోదావరి వరద కాస్త తగ్గుముఖం పట్టినప్పటికీ నిలకడగా కొనసాగుతోంది. మండలంలోని లంక గ్రామాల్లో పంట భూముల్లో కొద్దిగా వరద తగ్గినా వాణిజ్య పంటలు వరద నీటిలోనే ఉన్నాయి. నాలుగైదు రోజులుగా వరద నీటిలో ఉండటం వల్ల పంటలకు భారీ నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు. బడుగువాని లంక గ్రామానికి వరద ముంపు పూర్తిగా తప్పింది. బడుగువానిలంక, మడికి, చెముడులంక, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంక భూముల్లో పంటలకు నష్టం అధికంగా ఉంటుందని రైతులు చెప్తున్నారు. జొన్నాడ వద్ద పుష్కర ఘాట్ వరద నీటిలోనే కొనసాగుతోంది.

పంటలు ఇంకా ముంపులోనే

ఆత్రేయపురం, జూలై 26: గోదావరికి వరద తగ్గుముఖం పట్టడంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరద కారణంగా లంక రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. పిచ్చుకలంకలోని పైలంకలో సాగుచేసుకుంటున్న పంటలను వరద ముంచెత్తింది. పిచ్చుకలంక పర్యాటక కేంద్రంలో తొమ్మిది కుటుంబాలకు చెందిన నిర్వాసితులు గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. వాడపల్లి పుష్కర ఘాట్ల వద్ద మెస్‌లు ఏర్పాటుచేసి భక్తులు గోదావరిలో స్నానాలకు దిగకుండా రక్షణ చర్యలు చేపడుతున్నారు.

ముంపులోనే లంక పొలాలు

రావులపాలెం, జూలై26: గోదావరికి వరదనీరు పోటెత్తిన క్రమంలో లంక పొలాలు ముంపుబారిన పడ్డాయి. మండలంలోని గౌతమి,వశిష్టపాయల పరివాహక ప్రాంతాల్లోని లంకపొలాల్లోకి వరదనీరు చేరడంతో వాణిజ్య పంటలు ముంపులో చిక్కుకున్నాయి. కోతకు వచ్చిన పంటలను రైతులు పడవలపై వెళ్లి కోసి తెచ్చిమార్కెట్లో విక్రయిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి చట్టాలు చేయాలి

కె.గంగవరం, జూలై 26: మత్స్యకారుల సమస్యలు పరిష్కారానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చట్టాలు చేయాలని మత్స్యకార సంఘం రాష్ట్ర నాయకుడు దోమ ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఎన్‌పీఎస్‌ఎస్‌డబ్ల్యూఎఫ్ దక్షిణాది రాష్ట్రాల కార్యవర్గ సమావేశం చెన్నైలో జరిగింది. సమావేశం వివరాలను ఆయన విలేకరులకు తెలిపారు. మత్స్యకారులు నివశించే చోట నీటి పట్టాలు మత్స్యకార సంఘాలకు ఇవ్వాలని, ఆయిల్ కంపెనీల వల్ల ఉపాధి కోల్పోతున్న మత్స్యకార కుటుంబాలకు ప్రతీ నెల రూ.18వేలు ఇవ్వాలని, రాష్ట్రంలో ఉన్న ప్రతీ నీటి మడుగుపై సర్వహక్కులు మత్స్యకారులకు ఇవ్వాలని తదితర డిమాండ్లు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో వి.కొండబాబు, సీహెచ్.శ్రీనివాసు, కె.బాలాజీ, కోదండ, ఏ. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు

అయినవిల్లి, జూలై 26: గోదావరి వరద ముంపునకు గురైన లంక గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టారు. అయినవిల్లి మండలంలో పారిశుధ్య కార్యక్రమాలను శుక్రవారం డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు పరిశీలించారు. దోమల నివారణకు ఎబేట్, మలాథియాన్ మందు స్ప్రే చేయాలని, నిల్వ నీరు ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, ఫాగింగ్ యంత్రాలు వినియోగించాలని సూచించారు. సర్పంచ్ సలాది బుచ్చిరాజు, విస్తరణాధికారి గరిమెళ్ల రవి, కార్యదర్శులు ఆర్.సూర్యనారాయణమూర్తి, కొంకి రామచంద్రరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముమ్మిడివరం, జూలై 26: సీహెచ్ గున్నేపల్లి నల్లావారిపేటలో పేకాట శిబిరంపై ఎస్ఐ డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ముగ్గుర్ని అరెస్టు చేసి కోర్టు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,600 నగదు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పశువులకు అంటువ్యాధి నివారణ టీకాలు

మలికిపురం, జూలై 26: వరద ప్రభావిత ప్రాంతాలు రామరాజులంక, దిండి గ్రామాల్లో పశువులకు అంటువ్యాధుల నివారణలో భాగంగా ముద్దు చర్మవ్యాధి (ఎల్ఎస్పీ), గొంతు వాపు నివారణా టీకాలు వేశారు. శిబిరాన్ని ఎంపీపీ ఎంవీ సత్యవాణి ప్రారంభించారు. పశువైద్య సహాయం సంచాలకులు డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, డాక్టర్ శివకుమార్, మాజీ సర్పంచ్ బొరుసు సుబ్బారావు, ముద్దల శ్రీను, మేడిచర్ల గంగన్న పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో జేసీ నిషాంతి పూజలు

ద్రాక్షారామ, జూలై 26: ద్రాక్షారామ బీమేశ్వరాలయాన్ని శుక్రవారం జేసీ నిషాంతి సందర్శించారు. భీమేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆర్డీవో సుధాసాగర్, తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 26: రెవెన్యూ రికార్డుల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జేసీ టి.నిశాంతి ఆదేశించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ డివిజన్‌కార్యాలయంలో రెవెన్యూ రికార్డుల భద్రతపై సమీక్ష నిర్వహించారు. ఎల్లవేళలా రికార్డుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రతపై పోలీసు అధికారుల సహకారం పొందాలన్నారు. సాంకేతిక సమస్యలుంటే ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారమార్గాలు పొందాలన్నారు. ధ్రువీకరణ పత్రాలు జారీ, మ్యుటేషన్‌పై సమీక్ష జరిపారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎస్.సుదాసాగర్, డివిజన్‌లో తహసీల్దార్లు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే వేగుళ్ల



మండపేట, జూలై 26: ఐటీ మంత్రి నారా లోకేశ్‌ను శుక్రవారం అమరావతిలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్ కలిసి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల సమయంలో మండపేటలో కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు విజయం కోసం పనిచేసిన చుండ్రును లోకేశ్ అభినందించారు. లోకేష్‌ను కలిసిన వారిలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయండి

అంతర్వేది, జూలై 26: రూ.1.50కోట్లతో చేపట్టిన సఖినేటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను జగన్ ప్రభుత్వం మధ్యలోనే గాలికొదిలేసిందని బీజేపీ నాయకులు అన్నారు. గత ప్రభుత్వ పాలనలో నిధులను దారి మళ్లించడంతో అభివృద్ధి కుంటుపడిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, రాష్ట్ర కిసాన్‌మోర్చా డ్రైనేజీసెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు విమర్శించారు. గుత్తేదారునికి ఇవ్వాల్సిన కొద్దిపాటి బకాయిలను వెంటనే చెల్లించి ఆరోగ్య భవన నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పట్టాపు సూర్యప్రకాశరావు, యెనుముల సుబ్బారావు, బొమ్మిడి నరసింహస్వామి, కొల్లాబత్తుల నాగభూషణం, పడాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు రద్దు చేయండి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 26: రామచంద్రపురంలో ఎరుకుల కులంపేరుతో జారీచేసిన నకిలీ ఎస్టీకుల ధ్రువీకరణ పత్రాలు రద్దు చేయాలని, నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పొందుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఎరుకుల కుల సంక్షేమ సంఘం సభ్యులు తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. రామచంద్రపురంలో 30ఎరుకుల కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. పట్టణంలో కొంతమంది ఇతరసామాజిక వర్గం ఎరుకుల కులమని చెప్పి ఎస్టీకుల ధ్రువీకరణ పత్రాలు పొంది ప్రభుత్వఉద్యోగాలు, రాజకీయ రిజర్వేషన్లు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎరుకుల కుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మానుపాటి రామకృష్ణ, కౌన్సిలరు అమలదాసు రాజు, మానుపాటి గోవిందు, బండారుసత్యనారాయణ, సమతం పాపారావు, బారతీరాజు పాల్గొన్నారు.



అమలాపురంలో కార్గిల్ విజయోత్సవ ర్యాలీ

కార్గిల్ విజయోత్సవ ర్యాలీ

అమలాపురం టౌన్, జూలై 26: భారతీయ జనతా యువమోర్చా జిల్లా శాఖ అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో శుక్రవారం కార్గిల్ విజయోత్సవ సభ నిర్వహించారు. బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబుముఖ్య అతిథిగా పాల్గొని కార్గిల్ యుద్ధంలో సాధించిన విజయాలు వివరించారు. వీరోచిత పోరాటాలను మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా వివరించారు. మాజీ సైనికులు డీఎస్ మూర్తి, ఎం.లక్ష్మణరావు, ఎం.సత్యనారాయణ, జె.త్రిమూర్తులును సత్కరించారు. సభలో జిల్లా ప్రధాన కార్యదర్శులు మోకా వెంకటసుబ్బారావు, చీకురుమెల్లి శ్రీనివాసరావు, యిళ్ల వెంకటేశ్వరరావు, గనిశెట్టి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, చెరుకూరి గోపాలకృష్ణ, సీనియర్ నాయకుడు ఆర్వీ నాయుడు పాల్గొని ప్రసంగించారు. అనంతరం అమలాపురం గడియార స్తంభం సెంటరు నుంచి చేపట్టిన విజయోత్సవ ర్యాలీని జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు శివాజీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాశిన ఫణీంద్ర, గనిశెట్టి అరవింద్ ప్రారంభించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి జాతీయ పతాకాలను చేతబూని సినిమారోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయం వద్దనున్న భరతమాత విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చిలకమర్రి కస్తూరి, ఆకుమర్తి బేబీరాణి, చిట్టూరి రాజేశ్వరి, జగతా శాంతి తదితరులు పాల్గొన్నారు. ఇమ్మిడివరప్పాడు ప్రాథమిక పాఠశాలలో కార్గిల్ విజయ్‌దివస్ నిర్వహించారు. జాతీయ పతాకాలతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించగా ఉపాధ్యాయులు, బీజేపీ నాయకుడు సోరపల్లి పద్మినీకుమార్ పాల్గొన్నారు.

వీర జవాన్లకు సన్మానం

కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న వీర జవాన్లతో పాటు మరో ముగ్గురు జవాన్లను శుక్రవారం ఘనంగా సత్కరించారు. కార్గిల్ దివస్‌ను పురస్కరించుకుని అమలాపురం ఎన్టీఆర్ మార్గ్‌లోని శ్రీపూర్ణపుష్కలాంబ సమేత అయ్యప్పస్వామి ఆలయం వద్ద ధర్మకర్త గోకరకొండ గంగన్నస్వామినాయుడు ఆధ్వర్యంలో వీర జవాన్లను సత్కరించారు. కార్గిల్ యుద్ధంలో పలు సంఘటనలను వీర జవాన్లు జక్కంశెట్టి త్రిమూర్తులు, బీఎస్ఎన్ మూర్తి, ఎంబీ రమణ, ఎన్ఎస్ నారాయణ, ఎం.లక్ష్మణరావు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, వీర తాతాజీ, బసవా సింహాద్రి, వడగన శ్రీను, గోకరకొండ వీరేశ్వరరావు, జవ్వాది రాజారావు, రవణం కాసు పాల్గొన్నారు.

బట్టేలంకలో కార్గిల్ విజయదివస్ వేడుకలు

మలికిపురం,జూలై26: కార్గిల్ యుద్ధం జరిగి నేటికి 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా బట్టేలంకలో సర్పంచ్ బోనం సీతారత్నం ఆధ్వర్యంలో మాజీ సైనికులను శుక్రవారం సత్కరించారు. యుద్ధంలో అమరులైన సైనికులకు నివాళులర్పించారు. మాజీ సైనికులు ఉల్లంపర్తి రామమూర్తి, ఉల్లంపర్తి ఏసురత్నంలను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ ఆవుపాటి ఉమాలలిత, పెన్మెత్స త్రిమూర్తిరాజు పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కల రిజిస్ట్రేషన్లకు దరఖాస్తులు

అంబాజీపేట, జూలై 26: స్థానిక ఉద్యాన పరిశోధన కేంద్రంలో కొబ్బరి మొక్కలు అవసరమైన రైతులు స్పాట్ రిజిస్ట్రేషన్ చేస్తామని పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు అన్నారు. కొబ్బరిమొక్కలు కావాల్సినవారు ఆధార్, పట్టాదారుపాస్‌బుక్ జిరాక్స్‌లను కార్యాలయంలో అందించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

రికార్డులను పగడ్బందీగా భద్రపరచాలి

మామిడికుదురు, జూలై 26: రెవెన్యూ కార్యాలయాల్లోని పాత రికార్డులను పగడ్బందీగా భద్రపరచాలని అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి సూచించారు. మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల దహనం నేపథ్యంలో ఆర్డీవో శుక్రవారం మామిడికుదురు తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. గ్రామ సేవకులను విడతల వారీగా రెవెన్యూ కార్యాలయాల వద్ద కాపాలాగా పెట్టాలని ఆదేశాలిచ్చారు.తహసీల్దార్ మేరీకమ్మ, డిప్యూటీ తహసీల్దార్ మేరికమ్మ, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సమస్యలపై మంత్రికి వినతి

మలికిపురం, జూలై 26: రాజోలు నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో విద్యుత్ కొరతతో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తదితరర సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. ఈసమస్యల పరిష్కారానికి గుడిమెళ్లంక, గుడిమూలల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేయాలని, లక్కవరం, రాజోలు సబ్‌స్టేషన్లలో కెపాసిటీని 5ఎంవీఏనుంచి 8ఎంవీఏకు పెంచాలని కోరారు.

సాయం అందజేత

రాజోలు, జూలై 26: మెరకపాలెంలో శెట్టిం దాసుకు చెందిన తాటాకిల్లు అగ్ని ప్రమాదానికి ఆహుతై కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. సర్పంచ్ గిడుగు బుజ్జిబాబు శుక్రవారం దాసు కుటుంబ సభ్యులకు 30కిలోల బియ్యాన్ని అందజేశారు. ఉపసర్పంచ్ అర్జునరావు, మాజీ ఉపసర్పంచ్ అడబాల సత్యరమేష్, గిడుగు బ్రహ్మజీ, వీఆర్వో టి.వాసవి, పి.కమలతేజ పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

యానాం, జూలై 26: యానాంలోని వరద ముంపు ప్రాంతాలు టైడాల్‌లాక్, జీఎంసీ బాలయోగినగర్, రాజీవ్ బీచ్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పర్యటించారు. వరద తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అధికారులతో సమీక్ష నిర్వహించి వరదకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు.

మండపేటలో సినీనటి అపూర్వ

మండపేట, జూలై27: ప్రముఖ వర్ధమాన సినీనటి అపూర్వ శుక్రవారం మండపేటలో పలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశా రు. వల్లూరి వారి వీధిలోని అష్టలక్ష్మీ అమ్మవార్ని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండపేట ఏడిద రోడ్డులోవున్న పెద్దమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు. ఆమెకు ఆలయ నిర్వాహకులు వాలిన వీరబాబు ఆమ్మవారి ఆలయ విశిష్టతను వివరించారు. ఆమెకు ఆలయ ట్రస్టీవాలిన వీరబాబు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఆమె వెంట కుటుంబసభ్యులు, సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

కీటక జనిత వ్యాధుల నివారణకు చర్యలు

అమలాపురం రూరల్, జూలై 26: కీటక జనిత వ్యాధుల వ్యాప్తి నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు రాజమహేంద్రవరంలోని జోనల్ మలేరియా కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ బీఎల్ఎస్ కుమార్ తెలిపారు. శుక్రవారం జోనల్ ఎస్‌యూవో ఎస్వీ రవిశేఖర్, సిబ్బందితో కలిసి ఆయన రెడ్డిపల్లి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో మలేరియా, డెంగ్యూ కీటక జనిత వ్యాధుల వ్యాప్తి నివారణలో భాగంగా తీసుకుంటున్న చర్యలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జ్వరరోగుల సమాచార సేకరణ, నిల్వనీటి గుంటలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పీహెచ్‌సీ సిబ్బందితో పాటు రాజ్‌కుమార్, రాజబాబు, ఉప్పుగంటి బసవరాజు పాల్గొన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

ముమ్మిడివరం, జూలై 26: ఎస్పీ బొడ్డేపల్లి కృష్ణారావు శుక్రవారం ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్‌లో క్రైమ్ రిజిష్టర్, ఇతర రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారుల పట్ల ఎలా వ్యవహరించాలనే విషయాలపై సిబ్బందికి సూచనలిచ్చారు. శిథిలావస్థకు చేరుకున్న పోలీసుస్టేషన్ భవనాన్ని తక్షణం ఆధునికీకరించాల్సి ఉందన్నారు. పోలీసు క్వార్టర్స్‌ను పరిశీలించారు. అక్కడ డాగ్‌స్క్వాడ్ కోసం ఏర్పాటుచేసిన భవనాన్ని ఆయన పరిశీలించారు. ఎస్పీ వెంట ఎస్ఐ డి.సురేష్‌బాబు ఉన్నారు.

కాల్వను బాగు చేసుకుని సమస్యను తీర్చుకున్నారు

మామిడికుదురు, జూలై26: నగరం పిల్లి రామారావు కాలనీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు వరిచేలు నిండా మునిగాయి. మురుగునీరు దిగే ఆస్కారం లేకపోవడంతో సమస్యను అధికారులకు రైతులు విన్నవించారు. అధికారులు పట్టించుకోకపోవడంతో శుక్రవారం రైతులు ఎక్స్‌క వేటర్‌తో కాల్వను బాగు చేసుకున్నారు. రైతులు తాటికాయల ఉదయభాస్కరరావు, కడలి నాగేశ్వరరావు, వాణరాశి త్రిమూర్తులు, వాకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెల్లూరులో పొలంబడి

రాయవరం, జూలై 26: చెల్లూరులో శుక్రవారం మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏవో కె.ప్రభాకర్ మాట్లాడుతూ పురుగుమందులు రసాయనిక ఎరువులు అవశేషాలు లేకుండా ఆహార ఉత్పత్తులు పండించడమే పొలంబడి లక్ష్యమన్నారు. ప్రకృతిక వ్యవసాయం వల్ల కలిగే లాభాలు, జీవామృతం తయారీ వంటి అంశాలపై అనంతకుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముత్యాల వీరవెంకట సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్, వల్లూరి సత్యప్రసాద్, బలుసు వీరవెంకట సత్యనారాయణ చౌదరి, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతిక వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వృద్ధుడి గల్లంతు?

పి.గన్నవరం, జూలై26: పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వృద్ధుడు గల్లంతయ్యాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాజోలుకు చెందిన సానబోయిన సత్యనారాయణ(65)కు కొన్నాళ్ల క్రితం కాలికి గాయం కావడంతో ఒక కాలును తొలగించారు. వాకింగ్‌స్టాండ్ సాయంతో జీవనం సాగిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం రాజోలు నుంచి వచ్చి గన్నవరంలో ఒక హోటల్ టిఫిన్ చేసినట్టు స్థానికులు తెలిపారు. అక్విడెక్ట్ వద్ద వాకింగ్‌స్టాండ్, చెప్పులు ఉన్నాయి. వీటిని ఎస్ఐ బి.శివకృష్ణ, వీఆర్వో తోట శ్రీను పరిశీలించారు. గోదావరిలో గల్లంతై ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ఆపరేషన్ రావణ
శ్రీలలిత	: పురుషోత్తముడు
శేఖర్ స్ర్కీన్-1	: డార్లింగ్
శేఖర్ స్ర్కీన్-2	: డెడ్ పూల్
రమా	: రాయన్
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: డెడ్ పూల్

పంచాయతీ కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ



ఆలమూరు, జూలై 26: ఆలమూరు పంచాయతీ కార్మికులకు శ్రీసిద్ధార్థ హైస్కూలు యాజమాన్యం రెయిన్‌కోట్లు పంపిణీ చేసింది. సర్పంచ్ నాతి లావణ్యకుమార్‌రాజా, కార్యదర్శి సంజీవ్‌రెడ్డి సమక్షంలో కార్మికులకు అందజేశారు. అన్నికాలాల్లోనూ ప్రజల ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికులు సేవలను స్కూల్ డైరెక్టర్ ముల్లారావు కొనియాడారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.1.53లక్షలు

ఆత్రేయపురం, జూలై 26: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామికి వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,53,500 లభించినట్టుఈవో తెలిపారు.

టీడీపీ సీనియర్ నేత మృతి



ఆత్రేయపురం, జూలై26: టీడీపీ ర్యాలి గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు, ఆ పార్టీ సీనియర్ నేత హనుమంతు సత్యనారాయణ (అన్నవరం) (63) అనారోగ్యంతో శుక్రవారం ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. స్థానిక నాయకులు అన్నవరం మృతదేహం వద్ద నివాళులర్పించారు.

రేషన్‌కార్డులు మంజూరు చేయండి

యానాం, జూలై26: యానాంలో ఏళ్ల తరబడి నివాసం ఉంటూ కొత్తగా వివాహం చేసుకుని వేరుగా జీవిస్తున్న వారికి నూతనంగా రేషన్ కార్డులు మంజూరు చేయాలని సావిత్రి నగర్ యువత అధ్యక్షుడు మల్లాడి రాజు కోరారు. స్థానికులతో ఆర్ఏ మునిస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు.

నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

అమలాపురం టౌన్, జూలై 26: విద్యార్థి దశ నుంచే సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సమగ్ర శిక్షా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదనరావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో శిక్షా సప్తాహ్‌ను జిల్లావ్యాప్తంగా అన్నిపాఠశాలల్లో నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం అమలాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు అనేక అంశాల్లో ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదనరావుతో పాటు డీవైఈవో జి.సూర్యప్రకాశరావు, సమగ్రశిక్షాఏపీవో ఎంఏకే భీమారావు, ఏఎల్ఎస్‌వో రమేష్, కోర్సు కో-ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ,టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మండపేట, జూలై 26: గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించిందని, కూటమి ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతికి ప్రత్యేక దృష్టి సారించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిసి కోరినట్టు రాష్ట్ర నెయిలికుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కాటా గోపి తెలిపారు. మత్స్యకారులు జీవనంకు గత ప్రభుత్వం తీసుకువచ్చిన 217జీవోను రద్దు చేయాలని కోరారు. పంచాయతీ చెరువులు, రిజర్వాయర్లపై ఆధారపడి మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారన్నారు. 217జీవోను రద్దు చేసేందుకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్టు మంత్రి తెలిపారని ఆయన చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో మత్స్యకార నాయకులు అంపోలు సత్తిబాబు, బలసాలి రంగారావు, కాటా శ్రీరాములు, జంపా వెంకటరమణ తదితరులు వున్నారు.

మండలంలో 1,393మంది కౌలు రైతులు

ఉప్పలగుప్తం, జూలై 26: మండలంలో ఈసార్వాలో 1,393 మంది కౌలు రైతులను గుర్తించినట్టు వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు తెలిపారు. వీరిలో ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు 785మందికి సాగు హక్కు పత్రాలు మంజూరు చేశారన్నారు. బ్యాంకు రుణాలు పొందేలా బ్యాంకు అధికారులకు కౌలు రైతుల జాబితా ఇచ్చామన్నారు. మిగిలిన కౌలు రైతులు వీఆర్వోలను సంప్రదించి పంట సాగు హక్కు పత్రాలు పొందాలన్నారు.

ఆహారం, ఆరోగ్య భద్రత కల్పించాలి

ఉప్పలగుప్తం, జూలై 26: మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు ఆరోగ్య భద్రత కల్పించేలా తయారు చెయ్యాలని డీఈవో ఎం.కమలకుమారి కోరారు. ఆహారాన్ని పరిశీలించి భోజన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఎస్.కొత్తపల్లి ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాల అవగాహన, బోధన అంశాలపై ఆరా తీశారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞాన సాధనకు కృషి చెయ్యాలని విద్యార్థులకు సూచించారు. ఎంఈవో సత్తి సత్యకృష్ణ పాల్గొన్నారు.